
# రేపటి మేస్త్రి




**పెనుమాక నాగేశ్వరరావు**

**అజీజ్ ఆమరణ నిరాహారదీక్ష వార్త నాకు తెలిసేసరికి సమయం రాత్రి తొమ్మిది గంటల య్యింది. మా ఇంట్లో భోజనాలు కూడా పూర్తయ్యాయి. నిజానికి నాకు అప్పటికప్పుడు వెళ్ళి అతన్ని కలిసి విషయం తెలుసుకోవాలనే అనిపించింది. మా ఇంటికి అతని షెడ్డుకు మూడు కిలో మీటర్ల దూరం. మా ఆఫీసుకు వెళ్ళే దారిలో వుంటుంది అతని షెడ్డు.**

బహుశా మున్సిపాలిటీవారు తమ స్థలంలో కొంత ఆక్రమించుకుని షెడ్డు వేసుకున్న కారణంగా అతని షెడ్డుని తీసేయటమో లేక ఏకంగా వాళ్ళే తొలగించటమో జరిగి వుంటుంది. ఆ కారణంగానే బహుశా అజీజ్ ఆ నిర్ణయం తీసుకుని వుంటాడు అనుకున్నాను మనసులో.

గతంలో కూడా చాలాసార్లు మున్సిపాలిటీ వారు రోడ్డు ప్రక్కన పెట్టుకున్న టీ దుకాణాల్ని, కిళ్ళీ బంకుల్నీ, బండ్లపై పండ్ల వ్యాపారం చేసుకుంటున్న వారిని బలవంతంగా ఖాళీ చేయించటం, తెరవకుండా వున్న బడ్డీ కొట్లని ట్రాక్టర్లలో ఎత్తుకు పోవటం మళ్ళీ నాలుగు రోజుల్లో యథాప్రకారం ఎక్కడి దుకాణాలు అక్కడ తెరవబడటం జరిగింది. ఇటువంటి చర్యలకు అటు అధికారులు, ఇటు ఇలాంటి చిన్న వ్యాపారులు అలవాటు పడిపోయారు. ఇలాంటి నిర్ణయాలను సక్రమంగా అమలు జరపడం కష్టమనీ, ఆచరణలో అనేక ఇబ్బందులు ఎదురౌతాయనీ తెలిసినా తడవొకసారి ఇలాంటి అసమంజసపు చర్యలు ఎందుకు చేస్తారో, ఏం ఆశించి చేస్తారో ఏం సాధిస్తారో ఎవ్వరికీ అర్థంకాని విషయం.

అజీజ్‌కు నలభై పైచిలుకు వయసుంటుంది. ముగ్గురు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. పెద్దవాడ్ని, రెండోవాడ్ని తన దగ్గరే వుంచుకుని పని నేర్పుతున్నాడు. మూడోవాడ్ని ఈ మధ్యనే ఓ బేల్దారి మేస్త్రీ దగ్గరకు పనికి పంపుతున్నాడు. ఆడపిల్లని ఆరో ఏడు రాగానే స్కూల్లో చేర్పించాడు. అజీజ్ భార్య మిషన్ కుడుతుంది. నెలకు ఎంత లేదన్నా అయిదారు వందల దాకా సంపాదిస్తుంది. తనకు ఖర్చులు పోగా, నెల తిరిగేసరికి నాలుగువేల దాకా మిగుల్తుందని కూడా చెప్పాడు మాటల మధ్యలో ఓసారి అజీజ్.

పెద్దవాడికి పదమూడేళ్ళు. కొంచెం మెతగ్గా, బలహీనంగా వుంటాడు. రెండోవాడికి పన్నెండు సంవత్సరాలు. ఎప్పుడూ చలాకీగా వుంటాడు. పనిలో కూడా చురుకుదనం కనిపిస్తుంటుంది. బండిలో ఎక్కడ ఎలాంటి ఫాల్టు వుందో తండ్రి కనిపెట్టేటప్పుడు తనూ పరిశీలనగా చూస్తాడు. చొరవ చేసుకుని చెప్తాడు కూడా. చిన్నవాడైనా, అన్నని కూడా తనే అజమాయిషీ చేస్తుంటాడు, అజీజ్ బయటికి వెళ్ళినప్పుడు.

అజీజ్ అలాంటి నిర్ణయాలు తీసుకునే తత్వం వున్నవాడు కాదు. అందుకనే మొదట ఆ వార్తని నమ్మలేకపోయాను. అయితే చెప్పిన వ్యక్తి నాకు బాగా పరిచయస్థుడే. అబద్ధం చెప్పవలసిన అవసరం అతనికి లేదు. అజీజ్ గురించిన ఆలోచనలు నన్ను కలవరపరచసాగాయి.

అతనితో నాకు పాతిక సంవత్సరాల అనుబంధం. అతనో స్కూటర్ మెకానిక్. నేను ఉద్యోగంలో చేరక ముందునుంచే అతన్తో పరిచయం వున్నది నాకు. సెకండ్ హేండ్ మోపెడ్ కొన్న దగ్గర్నుంచీ ప్రస్తుతం వున్న స్కూటర్ వరకూ ఏ చిన్న రిపేరైనా అజీజ్ దగ్గరే చేయిస్తుంటాను. ఒక్కసారి కూడా నా బండి మరో మెకానిక్ దగ్గర చూపించలేదు. అతని పనితనం పైన నాకు మంచి గురి కుదిరింది. అంతేకాదు, అతని నిజాయితీ కూడా నాకు నచ్చుతుంది. వీటన్నింటికీ మించి చెప్పిన టైముకు బండి బాగుచేసి అప్పగించటం అతని ప్రత్యేకత. ఈ కారణాల వల్లనే నాలాగా చాలామందికి అజీజ్ అంటే ప్రత్యేకమైన ఆకర్షణ.

మనిషి చాలా మంచివాడు. పరుషంగా మాట్లాడటం చాలా తక్కువ. అదీ పని విషయంలో తన దగ్గర పనిచేసే పిల్లల దగ్గర తప్ప రిపేరు కోసం వచ్చే వాళ్ళతో అతనెప్పుడూ నవ్వుతూ మాట్లాడటమే నేను చూశాను. చాలామంది ఉద్యోగస్తులు తమ వాహనాలను అజీజ్ దగ్గరే బాగు చేయించుకుంటుంటారు. ఆ కారణంగా

అనేక డిపార్ట్‌మెంట్ వ్యక్తుల్తో అతనికి మంచి పరిచయాలే వున్నాయి. ఎలక్ట్రిసిటీ, మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీస్, ఆర్టీవో.. ఇత్యాది ముఖ్యమైన డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల్తో కూడా అతనికి పరిచయాలున్నాయి. అందుకే అందర్తోనూ మంచిగా మసలుకుంటూ తనకు, కావలసిన పనులు ఆయా వ్యక్తుల సహకారంతో పూర్తి చేసుకుంటూ, తెలివిగా లౌక్యంగా, ఎవర్నీ నొప్పించకుండా, తన ఆత్మాభిమానం దెబ్బతిన కుండా, వ్యాపారాన్ని సజావుగా సాగించే అజీజ్ ఏ కారణంచేత ఆమరణ నిరాహార దీక్ష చేయబూను కున్నాడో అర్థం కాలేదు. పైగా మాట మాత్రంగానైనా నాతో ఒక్కమాట అనలేదు. ఆఫీసుకు రోజూ కంటే అరగంట ముందరే బయల్దేరాను. దారిలో అజీజ్‌ను కలుసుకుని విషయం తెలుసుకోవాలని ఆరాటంగా వుంది, ఆతృతగా వుంది. షెడ్డు దగ్గర జనం గుమికూడి వున్నారు. స్కూటర్ కాస్తంత దూరంగా స్టాండ్ వేసి నిరాహారదీక్ష శిబిరం దగ్గరకు చేరుకున్నాను. నవ్వుతూ కూర్చున్న అజీజ్‌ని కళ్ళతోనే పలుకరించాను. దగ్గరగా వెళ్ళి కూర్చున్నాను.

"ఏమిటి ఈ నిర్ణయానిక్కారణం?" అడుగుతూనే శిబిరంలో కనిపిస్తున్న పేపర్లు చదవసాగాను ఒక్కొక్కటిగా.

"ఇవి మాత్రం చదువులు కావా?"

"చదువంటే డిగ్రీలు, సర్టిఫికెట్లేనా?"

"సంతకం నేరిస్తే చదువు నేర్చుకున్నట్లేనా?"

"ఉపాధి కల్పించలేని చదువులెందుకు?

అంతలోనే ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు వచ్చి అజీజ్ మెడలో పూల దండలు వేసి అభినందనలు తెలిపారు. వాళ్ళు అక్కడే కూర్చున్నారు. 'నేనూ ఓ దండ తెచ్చి వుండాల్సింది' మనసులో అనుకున్నాను. అజీజ్ షెడ్ దగ్గరే నాకు పరిచయం అయిన అయిదారుమంది రావడం, వాళ్ళతో కాసేపు కబుర్లు వగైరాలతో ఆఫీసుకు టైమయ్యింది.

"సాయంత్రం వచ్చేటప్పుడు కలుస్తానోయ్. అప్పుడు కాస్త తీరిగ్గా మాట్లాడుకుందాం" అని చెప్పి ఆఫీసుకు బయల్దేరాను. స్కూటర్ స్టార్ట్ చేస్తుండగానే వెనక నుంచి అరుపులు వినిపించాయి.

అజీజ్ భాయ్ జిందాబాద్

ఆమరణదీక్ష నెరవేరాలి

అజాజ్ భాయ్ జిందాబాద్

ఆ సమూహం శిబిరాన్ని సమీపించేసరికి నేనక్కడ్నుంచి బయల్దేరక తప్పలేదు, ఆఫీసుకు టైమ్ కావడంచేత. అయినా ఆలోచనలన్నీ అక్కడే వుండిపోయాయి.

ఓ నాలుగు రోజుల క్రితం ఎవరో ఇద్దరు వ్యక్తులు జీపులో వచ్చారు అజీజ్ షెడ్ దగ్గరకు. ఆ సమయంలో అతను బయట పనుండి వెళ్ళాడు. కొడుకులిద్దరూ మరో పనిచేసే కుర్రాడు మాత్రమే షెడ్ దగ్గర ఉన్నారు. జీపులో నుంచి దిగిన వ్యక్తుల్లో ఒకాయన –

"ఏయ్ మీ మేస్త్రీ ఏది?",

"బయటకు వెళ్ళారండి"

"మీరు ముగ్గురేనా ఇక్కడ పనిచేసేది?"

"అవునండి"

"మీ వయసులు ఎంతెంత?"

చెప్పారు వాళ్ళు ముగ్గురూ.

"పేర్లు చెప్పండి"

చెప్పారు.

"మీరు ఇక్కడ పని చేయకూడదు. బడికి వెళ్ళి చదువుకోవాలి. మీ మేస్త్రీకి చెప్పండి. మేం మళ్ళీ రెండ్రోజుల్లో వస్తాం. అప్పటికి మీరు ఇక్కడ వుండకూడదు" హెచ్చరిక చేశారు.

అయోమయంగా తలలాడించారు పిల్లలు.

తండ్రి రాగానే పరుగెత్తుకుంటూ ఎదురెళ్ళి జరిగిన విషయం చెప్పాడు చిన్నకొడుకు.

విషయం సీరియస్‌గా తీసుకోకుండా నవ్వి ఊరుకున్నాడు అజీజ్.

"పని చూడండ్రా.. వాళ్ళకేం ఏదోటి చెప్తుంటారు. ఇవన్నీ మామూలే" అంటూ బజారు నుంచి తెచ్చిన స్పేర్ పార్ట్స్ కొడుకు చేతికి అందించి కూర్చున్నాడు.

చెప్పిన ప్రకారం రెండ్రోజుల తర్వాత మళ్ళీ వచ్చారు ఆ అధికారులు.

"ఏయ్ నువ్వేనా మేస్త్రీవి?" జీపు దిగుతూనే అడిగారు.

"అవును"

"ఈ పిల్లల్ని ఇక్కడ పనిలో పెట్టుకున్నావ్ పధ్నాలుగేళ్ళ లోపు పిల్లల్తో పనులు చేయించుకోకూడదు. వాళ్ళని బడికి పంపాలి. చదువు నేర్పించాలి. మొన్నో రోజు చెప్పి వెళ్ళాం ఇంకా వాళ్ళని నీదగ్గరే వుంచుకున్నావేం?"

"వీళ్ళల్లో ఇద్దరు నా పిల్లలేనండీ"

"అయినా సరే వాళ్ళని కూడా పనిలో పెట్టుకోకూడదు. స్కూల్లో చేర్పించు"

"వాళ్ళు ఇంటి దగ్గర చదువుకుంటారండీ నేనే చెప్తుంటాను"

"నువ్వేం చదువుకున్నావ్"

"పదవ తరగతి ఫెయిలయ్యానండీ"

"ఇంటి దగ్గర చెప్పిస్తేనో, చెప్తేనో సరిపోదు. వాళ్ళని బడికి పంపించాలి. బాల కార్మిక వ్యవస్థకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాం విన్లేదా?"

"విన్నానండీ"

"వాళ్ళు కూడా పని చేస్తేనేగాని మా కుటుంబానికి గడవదండీ"

"అవన్నీ మాకు తెలీవయ్యా. నువ్వు ఎన్ని కబుర్లు చెప్పినా వాళ్ళని నీ దగ్గర వుంచుకుని పనికి ఉపయోగించటం నేరం. నీకు మరో రెండు రోజులు టైమిస్తున్నాం. ఈసారి మేము వచ్చేసరికి వాళ్ళు బడికి వెళ్తుండాలి. లేకపోతే నువ్వే ఇబ్బంది పడతావు నీ ఇష్టం" అని చెప్పి వెళ్ళిపోయారు.

అదుగో ఆ కారణం చేతనే మరో మార్గం కనిపించక ఈ నిరాహారదీక్షకు పూనుకున్నాడు అజీజ్.

సాయంత్రం ఆఫీస్ నుంచి తిరిగి వస్తూ అజీజ్ దగ్గర కూర్చుని వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాను.

"ప్రతివాళ్ళూ చదువుకోవాల్సిన అవసరం మాత్రం వున్నది. దాన్ని కాదన్లేం." అన్నాను.

"నేనూ కాదనటం లేద్సార్. అయినా నా పిల్లలిద్దరూ తెలుగు పుస్తకాలు చక్కగా చదువుతారు. పేపరు చదవగలరు. ఇంగ్లీష్ కూడా నాకు వచ్చినంతవరకు నేర్పిస్తున్నాను బుద్ధి కుదిరినప్పుడు. వాళ్ళు మాత్రం సంతకం నేర్చుకో, బ్రతుకు మార్చుకో అనే కదండీ ప్రచారం చేస్తున్నారు. సంతకం చేయడం చేతనయితే చదువంతా వచ్చేసినట్లేనా? అయినా నాకు తెలీక అడుగుతానూ వీళ్ళు చెప్పిన ప్రకారం పనిచేసే పిల్లలంతా చదువుల కోసం బడులకు వెళ్ళటం మొదలుపెడితే సరిపోయినన్ని బడులున్నాయా? చదువు చెప్పేందుకు సరిపోయినంతమంది




చదవండి! చదివించండి!!

ఆటవిడుపు

పిల్లల సచిత్ర మాస పత్రిక

ఆగస్టు 2005 సంచిక


విజ్ఞాన వినోదాల విపంచిక

# ఆడాళ్లూ మీకు జోహార్లు

**కాకాని కమల**

**అ**థ్లెటిక్స్ 12 స్వర్ణ పతకాలు, తుపాకీ షూటింగ్‌లో ఆరు పతకాలు సాధించిన రచనాగుప్తా (42) ఢిల్లీలోని ఏషియన్‌గేమ్స్ సిటీలో నివసిస్తూ యువతులకు గురి చూసి తుపాకీ పేల్చటంలో శిక్షణ ఇస్తోంది. 2000 సంవత్సరానికి అర్జున్ అవార్డు పొందింది.

రచనాగుప్తా బహుముఖ ప్రజ్ఞాశాలి. మణిపురి డ్యాన్స్‌లో ప్రవీణురాలు. హిందుస్తానీ సంగీతంలో దిట్ట. లక్నోలో చదువుకుంది. డ్రిల్లు మాస్టారుగారి ప్రోత్సాహంతో అథ్లెట్ అయింది. దేశవిదేశాల్లో పేరు గాంచింది, మన దేశానికి మంచి పేరు తెచ్చింది. తల్లితండ్రుల ప్రోత్సాహం నా ఉన్నతికి కారణం అంటుంది మంచి అమ్మాయిలా. మరి అంతే కదా? ❋



పంతుళ్ళున్నారా? ఇప్పుడున్న బడుల్ని చూడమనండి. పందుల దొడ్లలా ఎన్ని వున్నాయో తెలుస్తుంది" ఆవేశంగా అన్నాడు అజీజ్.

సమాధానం ఏం చెప్పాలో తెలియక మౌనంగా కూర్చుండిపోయాన్నేను.

"అసలు నాకు అర్థం కాక అడుగుతానండీ. మీ బోటివాళ్ళంతా మీ పిల్లల్ని మూడో ఏడు నిండీ నిండక ముందే మోయలేని పుస్తకాల బరువును భుజాన వేసి కాన్వెంట్లకి పంపుతున్నారు కదా! అది అన్యాయం కాదాండీ? మేము మా దగ్గర పనిచేసే పిల్లలకు చెపుతున్నది కూడా చదువేనండీ. నా దృష్టిలో ఇంకా పచ్చిగా చెప్పాలంటే కడుపునిండే మార్గం చూపుతున్నా, ఇదే అసలైన చదువు. కాదంటారా? అందరూ డాక్టర్లు, ఇంజనీర్లయితే రేపు మీ కార్లు, స్కూటర్లు పంచర్లయినా, రిపేరైనా ఎవడండీ దిక్కు? ఏ వయసులో నేర్చుకోవాల్సింది ఆ వయసులో నేర్చుకోవాలని చెప్పింది కూడా మీలా పెద్ద చదువులు చదువుకున్నవాళ్ళేగా? కార్బొరేటర్ విప్పాలంటే ఎన్నో నంబరు రెంచి వాడాలో, ఏక్సిలేటర్ సరిచేసేందుకు ఎన్నో నంబరు రెంచి వాడాలో, ఎప్పుడు స్క్రూడ్రైవరు వాడాలో, సుత్తి దెబ్బ ఎప్పుడెప్పుడు ఏయే మోతాదుల్లో తగలాలో నేర్పుతుంటాం మొదట్లో. ఈ వయసులో అయితేనే వాళ్ళకి బాగా వంటపడుతుంది. ఇప్పుడు వాళ్ళు బాగా నేర్చుకుంటేనేగా రేపు మేస్త్రీ అనిపించుకునేది!"

అజీజ్ చెప్తున్న విషయాలన్నీ వాస్తవంగానే ఉన్నాయ్ నా మనసుకు. అతన్ని తప్పుపట్టే అవకాశం ఏమాత్రం కనిపించలేదు మరి.

"నువ్వు చెప్తున్నవన్నీ నిజాలే అజీజ్. కానీ ఇదో పెద్ద సమస్యయ్యా" నసిగినట్లుగా అన్నాను.

"అన్నీ సమస్యలేనండి. మా బతుకులేవో మేం బతుకుతున్నాం. కష్టపడుతున్నాం, నాలుగు రూపాయలు సంపాదించుకుంటున్నాం. వీళ్ళకి ఎందుకు వచ్చిన బాధండీ బాబూ! రాజకీయాల్లోకి వెళ్ళాలంటే మాత్రం చదువు, సంధ్య అక్కర్లేదా, నా దగ్గర నా వయసువాడ్ని పనిలో పెట్టుకుని నేర్పించటం సాధ్యమయ్యే పనేనా? అయినా మొక్కై వంగనిది మానై వంగుతుందా?"

"ఏ విద్య అయినా చిన్నతనంలోనే ఒంటబట్టాలే" అన్నాను.

మా సంభాషణ జరుగుతుండగానే చాలా మంది జనం స్లోగన్స్‌తో అక్కడికి చేరుకున్నారు. అందరూ అజీజ్‌ని అభినందించ సాగారు. నేను మెల్లగా లేచి అతనితో చెప్పి బయల్దేరాను.


అజీజ్ ఆమరణ నిరాహారదీక్ష వార్త అలా అలా బాగా ప్రచారం పుంజుకుంది. అతనికి మద్దతుగా చాలామంది మేస్త్రీలు పోగయ్యారు. మరో నలుగురు కూడా నిరాహారదీక్ష ప్రారంభించారు. టీవీ వార్తల్లో కూడా ఈ విషయం చోటు చేసుకున్నది. రాజకీయ నాయకులు కూడా కాస్తంత కుతూహలం చూపసాగారు. ప్రతిపక్షాల వారికి ఇదో వంక దొరికింది అధికారపక్షం వారిని విమర్శించేందుకు. వాళ్ళు ప్రజల బాగు కోసం చేస్తున్న అనేకానేక మంచి పనుల్లో ఇదొకటని అధికారపక్షం వారు సమర్థించుకోవటంలో కృతకృత్యులవ్వసాగారు.

జర్నలిస్టులు, టీవీ యాంకర్లు అజీజ్ దగ్గరకు వచ్చి అతని అభిప్రాయాల్ని అడిగి తెలుసుకుంటున్నారు. నిరాహార దీక్ష గురించి పేపర్లో ప్రకటిస్తున్నారు, టీవీల్లో ప్రదర్శిస్తున్నారు. చిన్నగా మొదలైన ఉద్యమం తీవ్రరూపం దాల్చింది.

"నిజంగానే బాలకార్మికులకు వాళ్ళందరూ బడికి వెళ్ళి చదువుకుంటారే అనుకోండి వాళ్ళందరికీ ఉద్యోగాలిస్తారా ప్రభుత్వం వారు? సర్కారు నౌకరీల మీద ఆశ వదులుకోమని చెప్పారుగా. అయినా ఉపాధి కల్పించటం చేతకానప్పుడు వాళ్ళదారిన వాళ్ళని బ్రతకనీక వీళ్ళ జోక్యం ఎందుకండీ? చదువు సంస్కారం కోసం కానీ, సంపాదన కోసం కాదని పెద్ద పెద్ద మాటలు నాకు చెప్పొద్దు. చదువుకున్న మేధావులంతా ఏపాటి సంస్కారం కలిగి వున్నారో సమాజాన్ని చూస్తే అర్థమవుతూనే వున్నది. గవర్నమెంటు విడుదల చేసిన జీ.వో.ల్లో ఎటువంటి లోపాలున్నాయో వాటిని ఏ విధంగా దుర్వినియోగపరచి డబ్బు దండుకోవచ్చో అని శోధించి జనానికి నేర్పుతున్నది చదువుకున్న మహానుభావులే కదా? ఆ పుణ్యం వాళ్ళది కదా?

దినపత్రికల వాళ్ళు, టీవీ వాళ్ళు అజీజ్‌ని ఏవేవో అడగాలని ప్రయత్నిస్తుంటే అతనే వాళ్ళని ఇలాంటి ప్రశ్నలడగసాగాడు.

"నిజంగా పిల్లలందరూ చదువుకోవటమే ప్రభుత్వ లక్ష్యం అయితే పెద్ద పెద్ద కర్మాగారాలు నడుపుతున్న కోటీశ్వరులందరికీ ఓ తాఖీదు పంపవచ్చు. మీ మీ దగ్గర పనిచేసే పిల్లలందరికీ మీ కర్మాగారపు ఆవరణలోనే ప్రతిరోజు రెండు గంటలు చదువు చెప్పించాలనీ, అలా చెప్పేందుకు పిల్లల సంఖ్యని బట్టి టీచర్లను ఏర్పాటు చేసుకోవాలని, అలాంటి ఉత్తర్వులు ఉల్లంఘించిన వారికి ఉచిత రీతిన శిక్షించండి. అలా చేస్తే కాలే కడుపులకు ఇబ్బంది వుండదు. పిల్లలకు చదువూ వస్తుంది. మరి కొంతమంది నిరుద్యోగులకు ఉపాధీ దొరుకుతుంది. మాలా షెడ్డులు నడుపు



కుంటున్న వారి దగ్గర పనిచేస్తున్న పిల్లలకు కూడా కొన్ని కొన్ని సెంటర్లలో ప్రతిరోజు రెండు గంటలు చదువుకు వినియోగించేటట్లు చూడండి. అదేం కష్టం కాదే. మా వూళ్ళో ఓ ప్రయివేటు కాన్వెంట్ నడుపుతున్న ఆడమనిషి మొబైల్ స్కూలంటూ ప్రారంభించింది. ఆ మాత్రపు పని సర్కారు చేయలేదా చిత్తశుద్ధి వుండాలే కానీ"

"మీరు ఎన్నయినా చెప్పండి. రకరకాల పనులు చేస్తున్న పిల్లలు కూడా నా దృష్టిలో చదువుకుంటున్నట్లే లెక్క. వీటినే చదువులుగా గుర్తించండి చాలు. బండెడు పుస్తకాలు వీపున మోసుకుంటూ నిద్ర కళ్ళతో కాన్వెంటుకు వెళ్ళే పిల్లలకన్నా మా దగ్గర పనిచేస్తున్న పిల్లలు ఎక్కువగా కష్టపడుతున్నారని నేననుకోవటం లేదు."

"ఈ విషయంలో ప్రజల్నే ఆలోచించమంటున్నాను. నా మాటల్లో నిజం ఉందనిపిస్తే నాకు వత్తాసు పలకమంటున్నాను. నేటి బాలలే రేపటి పౌరులు. అలాగే నేటి కూలీలే రేపటి మేస్త్రీలు. వాళ్ళు లేనిదే మనకి భవిష్యత్తు లేదు. మన కార్లు మొండికేసినప్పుడు, మన ఇంటి తలుపు విరిగినప్పుడు, గోడ కూలినప్పుడు, కూలర్ చెడినప్పుడు, ఒకటేమిటి ప్రతినిత్యం మనకి వీళ్ళతోనే పని. వాళ్ళూ కావాలి, ఇంజనీర్లు, డాక్టర్లే సరిపోరు అన్నింటికీ"

"ఇప్పుడు చదువుకుంటున్న పిల్లల్లో చాలామందికి మార్కులు, ర్యాంకులు ఎలా వస్తున్నాయో అందరికీ తెలిసిన సంగతేగా! దొడ్డి దారిన దొంగ దారిన ర్యాంకులు తెప్పించి అమెరికాకు పంపి డాలర్లు పోగేసుకోవాలని తహతహలాడే తల్లిదండ్రుల కంటే మేమే నయమని నేననుకుంటున్నా. మాకు తెలిసిన విద్యనే వాళ్ళకీ నేర్పుకుంటున్నాం. అందరం కలిసి కష్టపడి కడుపు నింపుకుంటున్నాం. కన్నవాళ్ళని కళ్ళెదుటే ఉంచుకోగలుగుతున్నాం. కష్టాల్ని, సుఖాల్ని సమంగా పంచుకుంటున్నాం. సంతోషంగా వుంటున్నాం"

అజీజ్ వాగ్ధాటి చాలా మందిని కట్టిపడేయసాగింది. అతనికి మద్దతునిచ్చేవారి సంఖ్య రోజు రోజుకూ పెరగసాగింది. అతన్తో పాటు భార్యకూడా దీక్షలో చేరింది. అమెతోపాటు మరికొందరు మహిళలు, ఇంకొందరు మేస్త్రీలు కూడా అజీజ్ ప్రారంభించిన నిరాహారదీక్షలో పాల్గొనసాగారు.

"ఇది ప్రజలందరి సమస్య. పరిష్కరించుకోవలసిందీ ప్రజలే. రేపటి మేస్త్రీలను లేకుండా చేసుకోవడం అవివేకం అవునో, కాదో తేల్చుకోవలసిందీ, తెలుసుకోవలసిందీ ప్రజలే"

"అజీజ్ దీక్ష కొనసాగించటమో, విరమించటమో ప్రజా తీర్పు పైన ఆధారపడి వున్నది" అనుకున్నాను మనసులో. ❋


పాలుకురికి సోమనాథుడు రచించిన

**'బసవ పురాణము'**




మోడరన్ టైప్ సెట్టింగ్‌లో, 1/8, డెమీ సైజులో
అందమైన బసవేశ్వరుని వర్ణచిత్రం ముఖచిత్రంగా
430 పేజీలతో వెలువడింది.
ముఖ్యంగా
దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి
ప్రస్తావనతో సర్వాంగ సుందరంగా ముద్రించిన
అపురూప పుస్తకం.
ఇంకా ఈ పుస్తకంలో బసవపురాణంతో బాటు
అనుభవ సారము, చతుర్వేద సారము, వృషాధిప శతకము,
చెన్నమల్లు సీసములు ప్రచురించడం జరిగింది.
అపురూపమైన ఈ పుస్తకం వెల రూ.125/- మాత్రమే.

ప్రతులకు :
**ఆంధ్ర ప్రచురణ ప్రైవేట్ లిమిటెడ్,**
103/1, లజ్ చర్చి రోడ్, మైలాపూర్, చెన్నై 600 004 కు వ్రాయండి.
రూ. 125/- ఎం.ఓ. చేసినవారికి పోస్టేజి ఖర్చులు భరించి పుస్తకం పంపించగలము.



# ప్రియదత్త

సకుటుంబ సచిత్ర వారపత్రిక
విడి ప్రతి వెల : 5 రూపాయలు

**చందా వివరాలు**

సంవత్సర చందా (పోస్టు ద్వారా) రూ. 250/-
అర్ధ సంవత్సర చందా (పోస్టు ద్వారా) రూ. 125/-

# ఆటవిడుపు

పిల్లల మాస పత్రిక
విడి ప్రతి వెల : 8 రూపాయలు

**చందా వివరాలు**

సంవత్సర చందా (పోస్టు ద్వారా) రూ. 80/-
అర్ధ సంవత్సర చందా (పోస్టు ద్వారా) రూ. 40/-

**సంవత్సర చందాగా రూ. 300 చెల్లించిన పాఠకులకి ప్రియదత్త సకుటుంబ సచిత్ర వారపత్రికతోపాటు పిల్లల సచిత్ర మాసపత్రిక 'ఆటవిడుపు'ని కూడా ఏడాదిపాటు పోస్టు ద్వారా మీ ఇంటికి పంపటం జరుగుతుంది. ఈ సదవకాశాన్ని పాఠకులు సద్వినియోగం చేసుకోవలసినదిగా మనవి చేస్తున్నాము.**

మీ చందా మొత్తాన్ని మనియార్డర్ లేదా డిమాండు డ్రాఫ్టు ద్వారా 'ఆంధ్ర ప్రచురణ ప్రైవేట్ లిమిటెడ్' పేర 103/1, లజ్ చర్చి రోడ్, మైలాపూర్, చెన్నయ్ - 600 004 చిరునామాకి పంపగోరుతున్నాము.

పంపినవారి పేరు, పూర్తి చిరునామా పిన్‌కోడ్‌తో సహా రాయవలసిందిగా మనవి చేస్తున్నాము.
చెన్నయ్‌లో ఉన్నవారు చెక్కు ద్వారా చందా మొత్తాన్ని పంపవచ్చు.